క్లుప్తంగా

గణపతి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ



చాక్లెట్ వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 29వ వార్డులో బాల గణపతి యూత్ ఏర్పాటు చేసిన గణనాథుడిని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఇక్కడ 16 అడుగుల గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, మువ్వల సురేష్, కాగితాల సత్యనారాయణ, రవి కిరణ్, మహేష్, శ్యామ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణాభివృద్ధికే పంచాయతీ నిధులు వినియోగించాలి'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుపతిరావు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిధులను గ్రామాల అభివృద్ధికే వినియోగించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019–20 ఏడాదికి రూ.2,118 కోట్లు, 2020–21కి రూ.1,837 కోట్లు, 2021–22 ఏడాదికి 1,917 కోట్లు , ఈ ఏడాది రూ.2010 కోట్లు కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేసిందన్నారు. ఆ నిధుల న్నింటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని కోరారు.

జాషువా రచనలు.. ప్రజా చైతన్య దీపికలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ జాషువా కలం పదునైనదని, ఆయన రాసిన పద్యాలు, ప్రజా చైతన్య దీపికలుగా నిలిచాయన్నారు. అస్పృశ్యత నివారణపై జాషువా రచనలు సమాజంలో అసమానతలను ఎలుగెత్తి చాటాయన్నారు. తెలుగు విభాగాధిపతి ఆర్.కుసుమకుమారి మాట్లాడుతూ జాషువా బహుముఖ ప్రజ్ఞాశాలన్నారు. అధ్యాపకుడు గోపాలరావు.. జాషువా పద్యాలు ఆవిష్కరించిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతం అధ్యాపకుడు పోలా ఉమామహేశ్వరరావు, రవిబాబు, పద్మప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటు బాధితుడికి పరామర్శ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటకు చెందిన ఎర్రబిల్లి రాజు ఇటీవల పాముకాటుకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కేజీహెచ్‌కు వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

చిరకాల స్వప్నం.. నెరవేరిన వేళ

- ఆరిలోవలో సిద్ధమవుతున్న రైతుబజార్
- ప్రారంభోత్సవానికి సన్నాహాలు



సిద్ధమైన ఈవో కార్యాలయం, స్టోర్ రూం, ఆర్వో ప్లాంట్ గదులు



రైతుబజార్ కోసం నిర్మించిన షాపులు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఎప్పుడొప్పుడా అని ఎదురుచూస్తున్న ఆరిలోవ ప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. కొద్ది రోజుల్లో రైతుబజార్ అందుబాటులోకి రానుంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. రైతుబజార్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ కనెక్షన్, నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. ఈ రైతుబజార్ అందుబాటులోకి వస్తే అటు విశాలాక్షినగర్, డెయిరీ ఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, హనుమంతవాక నుంచి ఇటు పైనాపిల్ కాలనీ కొండవాలు ప్రాంతాలు, ఆరిలోవ కాలనీ నుంచి తోటగరువు వరకు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆరిలోవ ప్రాంతం జీవీఎంసీ 10వ వార్డు నుంచి 13వ వార్డు వరకు ఉంది. లక్షకు పైగా జనం ఉన్నారు. డెయిరీఫారం, ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, టీఐసీ పాయింట్, ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీతో పాటు కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతంలో రైతుబజార్ లేకపోవడంతో తాజా కూరగాయలు, నిత్యావసరాల కోసం స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అరెకరం స్థలంలో నిర్మాణం

రైతుబజార్ నిర్మాణం కోసం తోటగరువు దరి జెడ్పీహెచ్ పాఠశాల వెనక రెవెన్యూకు చెందిన అరెకరం స్థలాన్ని అధికారులు కేటాయించారు. ఈ స్థలంలో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం రూ.80 లక్షలు కేటాయించారు. కూరగాయలు, ఆకు కూరలు విక్రయించడానికి 38 షాపులు, 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం , వాచ్‌మన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గదిని నిర్మించారు. ఈ పనులు పూర్తయ్యాయి. ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేస్తున్నారు. త్వరలో ప్రారంభించడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి..

ఆరిలోవ ప్రాంతంలో రైతుబజార్ నిర్మించడం సంతోషంగా ఉంది. రైతుబజార్ లేకపోవడంతో కూరగాయల వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి, విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనా కొనక తప్పడంలేదు. తోటగరువు వద్ద నిర్మించిన రైతుబజార్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి.

– పి.సత్యవతి, బాలాజీనగర్

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



9వ వార్డు ఎస్సీ, ఎస్టీ కాలనీలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



28వ వార్డులో మహిళకు రక్త పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



20వ వార్డులో మహిళకు రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది



పాత వెంకోజీపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ/బీచ్ రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తూర్పు నియోజకవర్గంలో కొనసాగుతోంది. కొద్ది రోజులుగా నియోజకవర్గంలోని వార్డుల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. బుధవారం జీవీఎంసీ 9, 12, 28 వార్డుల్లో ఆరోగ్య సిబ్బంది సర్వే చేపట్టారు. ఆయా వార్డుల్లో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, యువకులు, గృహిణులకు రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం, జ్వరం తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 9వ వార్డులో ఎస్టీ, ఎస్సీ కాలనీ, 12వ వార్డులో లీలా సుందరినగర్, 28వ వార్డులో రామ్‌నగర్ ప్రాంతాలలో ఆరోగ్య సర్వే నిర్వహించారు.

20వ వార్డులో..

ఏయూ క్యాంపస్: ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 20 వ వార్డులో విస్తృతంగా సర్వే చేస్తున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కార్పొరేటర్ మువ్వల లక్ష్మి కోరారు. వార్డులో జరుగుతున్న సర్వేలో ఆమె పాల్గొని ప్రజలకు దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు.

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలో నిర్వహించిన సర్వేలో 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఏడు రకాల పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇసుకతోట యూపీహెచ్‌సీ హెచ్‌వీ సాయి, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, నర్సింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వచ్చేనెల 3న జరగనుంది.

ఉత్కంఠభరితంగా టెన్నికాయిట్ పోటీలు

- 300 మంది క్రీడాకారుల హాజరు
- అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు



పోటా పోటీగా తలపడుతున్న క్రీడాకారులు

పరవాడ/అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చేపట్టారు. ఈ పోటీల్లో 15 నియోజకవర్గాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. పోటీలను ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు (పీఎస్‌రాజు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. అందుకు తగ్గట్టుగా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర జట్టులో తలపడనున్న జట్లను కూడా ఎంపిక చేశారు. వీరికి క్రీడా దుస్తులకు గ్రామ సర్పంచ్ నాగమణి, ఆమె కుమారుడు కబడ్డీ అప్పారావు రూ.10 వేల నగదు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దివాకర్, గొంతిన సాయి శైలజ, పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణ, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఎస్.వి.రమణ, వైఎస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు పాల్గొని బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ దాలిబోయిన పైడిరాజు, సభ్యులు కె.సత్యనారాయణ, వై.బుజ్జి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం



గణపతి ఊరేగింపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సేవ గరిడీలు, భక్తిపాటలు ఆలపిస్తూ గణపతికి సాదరంగా వీడ్కోలు పలికారు. గణపతి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ విద్యార్థులకు కెనడా సురక్షితం కాదు



పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద జన జాగరణ సమితి ఏర్పాటు చేసిన బ్యానర్

మద్రిపాలెం: భారతీయ విద్యార్థులకు కెనాడా దేశం సురక్షితం కాదని జన జాగరణ సమితి మద్రిపాలెం విశాఖ రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాయలం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ఖలిస్తాన్ వేర్పాటు వాదానికి మద్దతుగా కొంతమంది సిక్కు విద్యార్థుల సమూహం భారతీయ విద్యార్థులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. కెనడా భారత్‌ల మధ్య ఏర్పడ్డ ఉద్రిక్తత వల్ల దేశ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ మన విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో భారతీయ విద్యార్తులు ఎవరూ కెనడా వెళ్లవద్దని వాసు సూచించారు.

త్రోబాల్ ఎంపికలు వాయిదా

అగనంపూడి: ఈనెల 30న నిర్వహించాల్సిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17 బాలురు, బాలికల విభాగం త్రోబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. 30న స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో త్రోబాల్ ఎంపికలు వాయిదా వేశామన్నారు.

29 నుంచి యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 29 నుంచి సాధారణ యోగా, థెరపటిక్ యోగా, మెడ, వెన్ను నొప్పి నివారణకు ప్రత్యేక శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులు జరుపుతామన్నారు. ఆసక్తి కలిగినవారు 9398019922, 9494401919, 8374351324లో సంప్రదించాలని సూచించారు.

కౌమారదశలో ఆరోగ్య పరిరక్షణ తప్పనిసరి



వర్క్‌షాపులో పాల్గొన్న వైద్యులు, విద్యార్థినులు

మహారాణిపేట : కౌమార దశలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్య–ఆరోగ్య శాఖ, రాష్ట్రీయ కిశోర స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించారు. నగరంలోని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్‌మిషన్ స్టేట్ ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ వెంకట రవికిరణ్, ఏపీ సొసైటీ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు ప్రసంగించారు. కౌమార దశలో బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే స్టేట్ ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ నిర్మల గ్లోరీ, నేషనల్ కన్సల్టెంట్ డాక్టర్ మునిరాజ్, ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వి. సమత, పలువురు ప్రొగ్రామ్ అధికారులు డాక్టర్ పి.రవికుమార్, కిరణ్‌దేశాయ్, డాక్టర్ హీనా దీక్షిత్, డాక్టర్ మృదుల, వై.కిషోర్, డాక్టర్ సాలిమా భాటియా, డాక్టర్ శ్రీలత, డాక్టర్ విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ నిర్ణయం చరిత్రాత్మకం


కులాల ప్రాతిపదికన జనగణన ప్రకటనపై నాయకుల హర్షం



మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: కులాల ప్రాతిపదికన జనగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకమని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె కార్యాలయంలో బుధవారం నగరంలోని పలు నియోజకవర్గాల యాత ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనగణన జరగాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నా.. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపేందుకు ఈ నిర్ణయమే సాక్ష్యమని పేర్కొన్నారు. కులగణన జరిగినప్పుడు రిజర్వేషన్ల అమలు తీరు ఏ మేరకు ఉందన్న విషయం, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలపై కూడా స్పష్టత వస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు మాట్లాడుతూ సమాజంలో రాజకీయ, ఆర్థిక, విద్య వంటి సదుపాయాలు పొందని అణగారిన వర్గాలకు కులగణన ద్వారా నూటికి నూరు శాతం ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆయా ప్రాంతాల యాత నాయకులు బసరమాని లక్ష్మణరావు, గొడ్డి కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, వడిశెల సూరిబాబు, సిమ్మా గోవిందరావు, వనుం లోకేష్, పిల్లి సంతోష్‌కృష్ణ, పిల్లి కన్నారావు, పిల్లి రాజా రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైల్వేలో పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ సాహూ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమైన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ద్వి వార్షిక సర్వసభ్య సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు తీర్మానాలు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది ఉద్యోగుల కొరత ఉందని, వెంటనే వీటిని భర్తీ చేయాలన్నారు. రైల్వే జోన్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను వెంటనే తొలగించి కొత్తవి నిర్మించాలని తీర్మానించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వే మెన్స్ సహకారంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నిరంతరం ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం పోరాడుతోందని తెలిపారు. అనంతరం రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మాళేశ్వరరావు, శ్రామిక్ కాంగ్రెస్ పరిధిలోని ఆయా బ్రాంచ్‌ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ఉత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు

అల్లిపురం : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహణం, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. దేవస్థానం వేద పండితులు, అర్చక స్వాముల పర్యవేక్షణలో పెదపూడి రఘురామాచార్యులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్మన్ కె.ఎస్.ఎన్.సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్యరూపవాణి, ఎం.ధనలత, బి.వెంకటరత్నం, ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, జి.ప్రకాష్, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువ



విజేతలకు బహుమతులు అందిస్తున్న టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ ఫణికుమార్

ఆరిలోవ: పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫణికుమార్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడ వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, డ్రాయింగ్ తదితర పోటీలు ఇటీవల నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం విజేతలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫణికుమార్ బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో శిక్షణ పొందాలన్నారు. భవిష్యత్‌లో టూరిజం శాఖకు మంచి ప్రాధాన్యత లభించనుందన్నారు. ఇప్పటికే పర్యాటకం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ ఏడాది జరగనున్న వైజాగ్ ఉత్సవాలలో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ఇన్‌స్టిట్యూట్ అధికారులు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, అధ్యాపకులు ఆర్.రవి, పార్థసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా అన్నసమారాధనలు



అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ శ్రీవిద్య



అన్నసమారాధనలో పాల్గొన్న వెంకటరావు, తదితరులు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరిలోవలో పలు చోట్ల అన్నమారాధనల సందడి నెలకొంది. బుధవారం జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని సంజీవినగర్‌లో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో, 12వ వార్డు దుర్గానగర్‌లో అన్నసంతర్పణలు చేశారు. సంజీవినగర్‌లో సేవా సంఘం సభ్యులు టి.శ్రీను, ఎం.ప్రసాద్, ఎల్.గోపి, ఎన్.అప్పారావు, ఎన్.రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. దుర్గానగర్‌లో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, మోహన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీ కాలనీ అంజయ్యనగర్‌లో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ప్రకటించిన విధంగా త్వరలోనే విశాఖ రాజధానిగా పాలన సాగించనున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మిడి కల్యాణ్, శంకర్, రాజేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ అప్పారి శ్రీ విద్య, గిరిబాబు పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్, బుగత ఏసురత్నం, త్రినాథ్, నరాల సత్తి బాబు, ఆర్జి వెంకటలక్ష్మి, మరియమ్మ, పాల్గొన్నారు.